సాక్షి అనంతపురం

ఆదివారం । 2 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.22,850

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,850 పలికాయి



9 నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు

కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 9 నుంచి 23 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.



న్యూస్‌రీల్

నాటు తుపాకుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులను చూపుతున్న ఎస్‌ఐ నాగమధు

కణేకల్లు: మండలంలోని సొల్లాపురం గ్రామ పొలాల్లో పడి ఉన్న రెండు నాటు తుపాకులను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పొలాల్లో గాలిమరల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రెండు నాటు తుపాకులను పడేసి వెళ్లిపోయారు. గాలిమరల కంపెనీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ నాగమధు తన సిబ్బందితో వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అగంతకులు నాటు తుపాకులను ఏ ఉద్దేశంతో అక్కడ వదలివెళ్లారో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

గొందిరెడ్డిపల్లి

ఎంఎస్ఎంఈ పార్క్ విస్తరణ

అనంతపురం టౌన్: రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి వద్దనున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్క్‌ను విస్తరించనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 100 ఎకరాల్లో ఉన్న ఈ పార్క్‌ను మరో 200 ఎకరాలకు విస్తరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం ఇప్పటికే రెవెన్యూ అధికారులతో కలసి ఏపీఐఐసీ అధికారులు భూములను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారని గుర్తు చేశారు. మరో రెండు నెలల్లో పూర్తి స్థాయిలో భూసేకరణ చేపట్టి గొందిరెడ్డిపల్లి ఎంఎస్ఎంఈ పార్క్‌ను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. 44వ జాతీయ రహదారి నుంచి ఎంఎస్ఎంఈ పార్క్ వరకు నాలుగు వరుసల రహదారి కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే వాటితోపాటు సబ్ స్టేషన్ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ముక్క లేనిదే ముద్ద దిగదాయె..



- అనంతపురంలోని పాతూరుకు చెందిన షణ్ముగ వయసు 15 ఏళ్లు. చికెన్ అంటే మహా ఇష్టం. ఒక్క రోజులోనే కేజీ చికెన్ ఫ్రైచేసి ఇచ్చినా తినేస్తానంటాడు. నెలలో 10 రోజులు చికెన్ ఉండాల్సిందే అంటున్నాడు.

- గుంతకల్లుకు చెందిన రోషన్ ఆలీకి ఇరవై ఏళ్లు. తండ్రి మటన్ వ్యాపారం చేస్తాడు. అయినా సరే రోషన్‌కు చికెన్ అంటే ప్రాణం. రోజూ రెండు ముక్కలైనా చికెన్ ఉండాల్సిందే అంటున్నాడు.

ఇదీ యుక్త వయసు పిల్లల ఆహారశైలి

- 75.3 శాతం మంది చికెన్‌పై అమితాసక్తి
- కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలపై నిరాసక్తత
- చేపల వినియోగంలో ఉమ్మడి జిల్లా టీనేజర్ల వెనుకంజ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: యుక్తవయసు పిల్లలు శాకాహారం కన్నా మాంసాహారానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. మెజారిటీ పిల్లలు చికెన్ అంటే మరీ లొట్టలేసుకుని తింటున్నారు. రాష్ట్రంలో మిగతా జిల్లాలతో పోలిస్తే చికెన్, మటన్ తింటున్న వారిలో ఉమ్మడి అనంతపురం జిల్లా మూడవ స్థానంలో ఉన్నట్టు తేలింది. నేషనల్ న్యూట్రిషనల్ సర్వే ఈ విషయాలను వెల్లడించింది. 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల పిల్లల్లో 75.3 శాతం మంది చికెన్ తింటున్నారు. తర్వాతి స్థానం 51.6 శాతంతో మటన్ ఆక్రమించింది. దేశంలో మాంసాహార వినియోగం ఏపీలో ఎక్కువగా ఉండగా, అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో తక్కువేమీ కాదన్నట్టుంది.

10 నుంచి 19 ఏళ్ల వయసు కుర్రాళ్లలో వివిధ మాంసాహార శాఖాహార వినియోగం ఇలా

కేటగిరీ	వినియోగం
చికెన్	75.3 శాతం
మటన్	51.6
చేపలు	38.7
పోర్క్	1.7
కూరగాయలు	21.6
పండ్లు	38.8

కూరగాయలు, పండ్లు తినడంలో వెనుకంజ

ఉమ్మడి జిల్లాలో చిన్నారులు, కుర్రాళ్ల చికెన్, మటన్‌ను ఇష్టపడినట్టుగా కూరగాయలు, పండ్లపై మక్కువ చూపడం లేదు. ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్ర అని జిల్లాకు పేరున్నా ఇక్కడ పండ్ల వినియోగం చాలా తక్కువగా ఉంది. 2–4 ఏళ్ల మధ్య వయసు చిన్నారుల్లో విటమిన్–ఏతో కూడిన తిండి, కూరగాయలు తినడంలో మిగతా జిల్లాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉన్నట్టు తేలింది. పండ్లు, కూరగాయలు తినడంలో కృష్ణా, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలు ముందంజలో ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపల లభ్యత బాగానే ఉన్నప్పటికీ చికెన్, మటన్‌తో పోలిస్తే తక్కువ వినియోగం ఉన్నట్టు తేలింది.

మాంసాహారంపైనే మక్కువ

- ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది కుర్రాళ్లు మాంసాహారం తినడానికి రకరకాల కారణాలున్నాయి. వాటిని ఒక్కసారి చూస్తే...
- కుటుంబ నేపథ్యంలో చిన్నప్పటినుంచే మాంసాహారంపై మక్కువ పెంచుకోవడం.
- చికెన్ ఉత్పత్తులు ఎక్కువగా అందుబాటులో ఉండటం.
- సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కొనుగోలు స్థాయి పెరగడం.
- మాంసాహారాన్ని సాధారణ మెనూగా భావించి వినియోగించడం.
- యువతను ఎక్కువగా ఆకర్షించేలా విభిన్న రుచుల్లో మాంసాహార వంటకాలు ఉండటం.
- మాంసాహార వినియోగం పెరుగుతున్న స్థాయిలో వ్యాయామం చేయడం లేదు.
- వయసుకు మించి బరువు ఎక్కువగా ఉన్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ఫైబర్ ఆహారం తినడం లేదు



- శరీరానికి అత్యవసరమయ్యే ఫైబర్ (పీచు)తో కూడిన ఆహారం కుర్రాళ్లకు రుచించడం లేదు.
- చిక్కుడు, గోరు చిక్కుడు, బీన్స్ వంటి కూరగాయలను పట్టించుకోవడం లేదు.
- మొలకలతో కూడిన గింజలు, చిరుధాన్యాలను దరిచేరనివ్వడం లేదు.
- గోబీ మంచూరియా, పానీపూరీ, కట్‌లెట్ లాంటి అనారోగ్యకర ఆహారంపై మక్కువ.
- పాలు, పాలపదార్థాలతో కూడిన ఆహారం కూడా తక్కువగా వినియోగిస్తున్నారు.
- ఫ్రైడ్ ఆహారం తినడం వల్ల 30 ఏళ్లకే గ్యాస్ట్రిక్, అల్సర్ సమస్యలతో సతమతం.

కలెక్టర్ సుడిగాలి పర్యటన



తాడిపత్రి మున్సిపల్ పరిధిలో పింఛన్ గురించి ఆరా తీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి రూరల్: కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం తాడిపత్రి ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేశారు. తొలుత యర్రగుంటపల్లి వద్ద ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లను మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని వెంకటలక్ష్మమ్మ ఇంటి వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతకు కలెక్టర్ భూమి పూజ చేశారు. సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను, సచివాలయాన్ని తనిఖీ చేశారు. అటవీ నర్సరీని పరిశీలించి విత్తనాల నాణ్యత, మొక్కల పంపిణీపై ఆరా తీశారు. 544–డీ హైవే పనులను పరిశీలించి పెండింగ్ భూసేకరణపై క్షేత్ర స్థాయిలో జాయింట్ కలెక్టర్ పర్యటిస్తారని అక్కడి బాధితులకు చెప్పారు. అనంతరం కలెక్టర్‌ను గ్రామస్తులు సన్మానించారు. అలాగే తాడిపత్రి మునిసిపాలిటీని కలెక్టర్ తనిఖీ చేశారు.తాగునీటి సరఫరాపై కమిషనర్ శివరామకృష్ణను ఆరా తీశారు. కృష్ణాపురం–2 సచివాలయాన్ని తనిఖీ చేశారు. క్షేత్ర స్థాయిలో పీ–4 సర్వేని పరిశీలించారు. పింఛన్ల పంపిణీపై లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు.

ఈద్ కా చాంద్ ముబారక్



అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ముస్లింలకు ఈద్ కా చాంద్ ముబారక్ చెప్పారు. మనిషిలోని చెడు భావనలను, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అభివర్ణించారు. శనివారం సాయంత్రం నెలవంక దర్శనంతో మత సామరస్యానికి, భక్తి భావానికి ప్రతీక అయిన విశిష్ట ఉపవాసాల మాసం ప్రారంభమైందని, అల్లా దయతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

తొలిరోజు టెన్షన్... టెన్షన్

- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరం ద్వితీయ లాంగ్వేజ్ పేపర్–1 పరీక్ష జరిగింది. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. 8 గంటల నుంచే విద్యార్థులు ఆయా కేంద్రాలకు రావడం కనిపించింది. ముఖ్యంగా మొదటి పరీక్ష కావడంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు టెన్షన్..టెన్షన్‌గా గడిపారు. చాలా కేంద్రాల్లో విద్యార్థుల వెంట తల్లిదండ్రులు, బంధువులు వచ్చి నోటీస్‌బోర్డులో హాల్‌టికెట్ నంబర్లను పరిశీలించి గదుల వరకు తీసుకెళ్లి వదిలారు.

761 మంది గైర్హాజరు

జిల్లా వ్యాప్తంగా మొత్తం 63 పరీక్ష కేంద్రాల్లో 761 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 4 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 14 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ నెల 3న సెకండియర్ విద్యార్థులకు ద్వితీయ లాంగ్వేజ్ పేపర్–2 పరీక్ష జరగనుంది.

అన్ని వర్గాలనూ దగా చేశారు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సూపర్ సిక్స్ పథకాలతో పాటు 143 హామీలు అమలు చేస్తామన్న చంద్రబాబు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి అన్ని వర్గాల వారినీ దగా చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం కోతలు తప్ప చేతల్లో చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తల్లికి వందనం పథకానికి 13,113 కోట్లు అవసరమైతే రూ.9,407 కోట్లు మాత్రమే కేటాయించి చాలామందికి మొండిచేయి చూపారన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో 66 లక్షల మందికి పింఛన్ ఇస్తే.. కూటమి ప్రభుత్వంలో ఫిబ్రవరిలో 63.59 లక్షల మందికి మాత్రమే ఇచ్చారన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఏటా 26 లక్షల మందికి 'చేయూత' ద్వారా ఒక్కొక్కరికి రూ.18,750 ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో దాని గురించి ప్రస్తావనే లేదన్నారు. దీపం పథకానికి రూ.4వేల కోట్లు అవసరమైతే రూ.2,300 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. గత ప్రభుత్వం ధరల స్థిరీకరణకు రూ.3,500 కోట్లు కేటాయిస్తే.. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించిందని, ఇవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. అన్నదాతా సుఖీభవ కింద లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించేలా కేటాయింపులు చేశారన్నారు.

సీమకు అన్యాయం

కూటమి సర్కారు ఇరిగేషన్‌కు సరైన కేటాయింపులు చేయకపోవడం, హంద్రీ–నీవాను 3,850 క్యూసెక్కులకు (మల్యాల నుంచి జీడిపల్లి వరకు) పరిమితం చేయడంతో భవిష్యత్తులో రాయలసీమకు తీవ్రమైన అన్యాయం చేయబోతున్నారని అనంత ఆందోళన వ్యక్తం చేశారు. హంద్రీ–నీవాను 10వేల నుంచి 12వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచేందుకు రాయలసీమ ప్రజాప్రతినిధులు పోరాడాలన్నారు. రాయలసీమలో హెచ్చెల్సీకి రూ.40 కోట్లు, హంద్రీ–నీవాకు రూ.3,200 కోట్లు కేటాయించారని, ఇవైనా ఖర్చు చేస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు ఎక్కడ చంద్రబాబూ అని ప్రశ్నించారు. పీఆర్సీ ప్రకటించకుండా.. ఐఆర్ ఇవ్వకుండా, పెండింగ్ డీఏలు విడుదల చేయకుండా దగా చేశారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, గౌని నాగన్న, చింతా సోమశేఖర్‌రెడ్డి, సైపుల్లాబేగ్, మల్లెమీద నరసింహులు, పుల్లయ్య, కేశవరెడ్డి, పసులూరు ఓబులేసు, వెన్నం శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి





ఎస్‌ఐల మార్చ్‌ఫాస్ట్, హోంమంత్రి అనిత చేతుల మీదుగా సీఎం పిస్టల్ అందుకుంటున్న ఎస్‌ఐ మంజునాథ్, చిత్రంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

- ఎస్‌ఐల పాసింగ్ అవుట్‌పరేడ్‌లో హోం మంత్రి అనిత

అనంతపురం: పోలీసులు ప్రజా సేవే పరమావధిగా పనిచేయాలని, పోలీసు స్టేషన్ గడప తొక్కే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో స్టైఫండరీ కేడెట్ ట్రైనీ (ఎస్‌సీటీ)–2024 ఎస్‌ఐల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు మొత్తం 394 మంది ఎస్‌ఐలు కాగా... ఇందులో 300 మంది సివిల్ ఎస్‌ఐలు, 94 మంది ఏపీఎస్‌పీ ఎస్‌ఐలు ఉన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో అనేక కఠిన సవాళ్లను ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీస్ శాఖ కృషి మరువలేనిదన్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్న నూతన ఎస్‌ఐలందరికీ అభినందనలు తెలిపారు. 394 మంది ఎస్‌ఐలలో 97 మంది మహిళా ఎస్‌ఐలు ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులపై ఏ చిన్న నేరమూ జరగకుండా వారిని కాపాడే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

జవాబుదారీతనంతో విధులు

శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్‌ఐలు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. అనంతరం శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్‌డోర్ విభాగాల్లో రాణించిన, ప్రతిభ కనబరిచిన వారికి హోం మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైనింగ్స్ విభాగం ఐజీపీ కేవీ మోహన్‌రావు, ఏపీఎస్పీ బెటాలియన్స్ విభాగం ఐజీ రాజకుమారి, కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, అనంతపురం ఎస్పీ పి.జగదీష్, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, ఎమ్మెస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, పీటీసీ కోర్సు డైరెక్టర్ మల్లికార్జున వర్మ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో రైతుబిడ్డ టాపర్

బెళుగుప్ప మండలం రమనేపల్లికి చెందిన రైతు దంపతులు ఆంజనేయులు, సాలమ్మల కుమారుడైన మంజునాథ్ ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించి అనంతపురం పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో శిక్షణ పొందాడు. శిక్షణలో అవుట్‌డోర్ టాపర్‌గాను, ఓవరాల్ టాపర్‌గాను, గోల్డ్ మెడల్‌తో పాటు సీఎం పిస్టల్ విజేతగా నిలిచారు. హోంమంత్రి అనిత చేతుల మీదుగా పిస్టల్ అందుకున్నారు. రైతు బిడ్డ ఎస్‌ఐ శిక్షణలో టాపర్‌గా నిలిచి బెళుగుప్ప మండలానికే పేరుతెచ్చారని సర్పంచ్ రమేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

సివిల్స్ లక్ష్యం



మాది విశాఖపట్నం. ఎంటెక్ పూర్తి చేశాను. బీటెక్ చదివేటపుడే సివిల్స్ రాయాలనే లక్ష్యం పెట్టుకున్నా. 2019లో ఎస్‌ఐ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ వచ్చింది. 2023లో పరీక్ష రాసి ఎంపికయ్యాను. ట్రైనింగ్ చాలా కష్టంతో కూడి ఉంటుంది. ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణలో రాటు దేలాను. సివిల్స్‌కు సన్నద్ధం అవుతాను. నా లక్ష్యాన్ని తప్పక చేరతాను అనే నమ్మకం ఉంది. – షహిబా అంజుమ్

నాన్న ఆశయం నెరవేర్చా



మాది కర్నూలు జిల్లా. బీఎస్సీ పూర్తి చేశాను. అమ్మ,నాన్న లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు. నాన్న ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్. నాన్న ఆశయంతోనే పోలీసు అధికారి అయ్యాను. సివిల్ సర్వీసెస్‌పై దృష్టి సారిస్తాను. ఐపీఎస్ సాధిస్తాననే నమ్మకం ఉంది. ఆడవాళ్లం అనే కారణంతో భయపడి వెనకడుగు వేయకూడదు. అనుకున్నది సాధించడానికి ప్రయత్నం ఆపకూడదు. – కె.చైతన్య స్వరూపిణి

ఫార్మసీ నుంచి పోలీస్ వృత్తిలోకి..



మాది అనంతపురంలోని సాయినగర్. బీ ఫార్మసీ పూర్తి చేశాను. అమ్మ,నాన్న పుష్పావతి, శివరాం. గ్రూప్–1కి సన్నద్ధం అవుతూ ఎస్‌ఐ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేశాను. ఎస్‌ఐగా ఎంపికైన అనంతరం గ్రూప్–1 రాసి డీఎస్పీగా ఎంపిక కావాలనే ఆకాంక్ష అధికమైంది. అమ్మ,నాన్న స్ఫూర్తితోనే ఉద్యోగం సాధించాను. – కేబీ చందనా ప్రియ

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ చించివేత



వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని చించివేస్తున్న టీడీపీ కార్యకర్తలు

యాడికి: మండల కేంద్రంలోని గాంధీజీ విగ్రహం ఎదురుగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శనివారం టీడీపీ కార్యకర్తలు చించివేశారు. మండల కేంద్రంలో ఈ నెల 7 నుంచి జరగనున్న చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని టీడీపీ కార్యకర్తలతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఒక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని చించివేశారు. ఈఘటన జరుగుతున్న సమయంలో తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సమీపంలో ఉండడం గమనార్హం.

మామిడితోటలో వ్యక్తి దారుణ హత్య




నగేష్ మృతదేహం

పుట్టపర్తి అర్బన్: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తిని గొంతు కోసి హతమార్చిన ఘటన వెంగళమ్మచెరువు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. బుక్కపట్నం మండలం కొత్తకోటకు చెందిన చియ్యేడు గంగన్న కుటుంబం సుమారు 15 ఏళ్ల క్రితం వెంగళమ్మచెరువులో స్థిరపడింది. గంగన్న కుమారుడు చియ్యేడు నగేష్(35) సొంతంగా ట్రాక్టర్ పెట్టుకొని బాడుగలకు తిప్పడంతో పాటు బేల్దారి పనులకు వెళ్లేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. స్థానిక షిర్డీసాయి బాబా ఆలయం సమీపంలోని వెంకటేషు మామిడితోటలో శనివారం సాయంత్రం నగేష్ మృతదేహాన్ని గుర్తించిన గ్రామానికి చెందిన పశువుల కాపరులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. దీంతో వారు అక్కడికి చేరుకుని బోరునవిలపించారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ లింగన్న సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ రప్పించి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా గ్రామంలోని సీసీటీవీ ఫుటేజీల్లో అదే గ్రామానికి చెందిన దివాకర్ అనే వ్యక్తి నగేష్‌ను బైకుపై ఎక్కించుకెళ్లినట్లు నమోదవడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతదేహం పక్కన మద్యం బాటిళ్లు పడి ఉండటంతో మద్యం మత్తులో గొడవ జరిగి హత్యకు గురయ్యాడా లేదా అక్రమ సంబంధం నేపథ్యంలో ఘటన జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తిరగని బతుకు మీటర్!

☛ అనంతపురంలో పని చేస్తున్న మీటర్ రీడర్ దేవిదీక్(పేరు మార్చాం) మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. ఇలాగైతే కుటుంబ జీవనం సాగించేదెలా? ఇలాగే ఉంటే మరో రెండు నెలలు వేతనాలు కూడా ఇవ్వరు. దీనిపై కాంట్రాక్టర్లతో గట్టిగా మాట్లాడాలి అంటూ వారి వాట్సాప్ గ్రూప్‌లో తన అభిప్రాయాన్ని పోస్టు చేశాడు. వేతనాల కోసం గట్టిగా అడిగితే వారి ఖాతా క్లోజ్ చేసి ఇంటికి పంపేస్తామంటూ కాంట్రాక్టర్ వార్నింగ్ ఇచ్చాడు. దీంతో మీటర్ రీడర్స్ ఎప్పుడు ఇస్తే అప్పుడే తీసుకుందాంలే.. ఉన్న ఉద్యోగం పోతే అంతే సంగతులు అంటూ కాలం వెళ్లదీస్తున్నారు.



- విద్యుత్ మీటర్‌రీడర్లకు మూడు నెలలుగా అందని వేతనాలు
- స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- వేతనం కోసం గట్టిగా అడిగితే ఉద్యోగం తొలగిస్తారంట!
- సమస్యను పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

అనంతపురం టౌన్: విద్యుత్ వినియోగదారులకు ప్రతి నెలా బిల్లును తీసి అందించే మీటర్ రీడర్ల బతుకు మీటర్ మాత్రం తిరగడం లేదు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రెండు నెలలు, మరి కొన్ని ప్రాంతాల్లో మూడు నెలలు కావొస్తున్నా వేతనాలు మాత్రం అందడం లేదు. కాంట్రాక్టర్లు మాత్రం ప్రతి నెలా తమకు రావాల్సిన బిల్లులను విద్యుత్ సంస్థ నుంచి తీసుకుంటూ మీటర్ రీడర్లకు మాత్రం మొండిచేయి చూపుతున్నారు. వేతనాలపై జీవనం సాగిస్తున్న దాదాపు 220 మంది మీటర్ రీడర్ల బతుకులు అగమ్యగోచరంగా తయారయ్యాయి.

వేతనాలు అడిగితే ఉద్యోగం తొలగిస్తారంట..

వేతనాల కోసం అడిగితే తమను ఉద్యోగం నుంచి తొలగిస్తారనే వాయిస్‌ను కాంట్రాక్టర్లు మీటర్ రీడర్లకు పంపారు. దీంతో వారు వేతనాలు ఇవ్వకపోయినా గట్టిగా అడగలేని పరిస్థితి. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆరు నెలల క్రితం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 24 ఏరియాలకు స్పాట్ బిల్లింగ్ టెండర్లను విద్యుత్ శాఖ అధికారులు పిలిచారు. 250 మందికి పైగా కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఏక పక్షంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇద్దరు వ్యక్తులకే స్పాట్ బిల్లింగ్ టెండర్లను ఖరారు చేశారు. టెండర్లలో ఎవరు తక్కువకు కోట్ చేశారనే విషయాలను పరిశీలించకుండానే ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల సూచనల మేరకు ఇద్దరు వ్యక్తులకు స్పాట్ బిల్లింగ్ టెండర్లను కట్టబెట్టారని అప్పట్లోనే అప్పటి ఎస్‌ఈపై విమర్శలు వెల్లువెత్తాయి. కాంట్రాక్ట్ పొంది ఐదు నెలలు కాగా దాదాపు 3 నెలల వేతనం మీటర్ రీడర్స్‌కు పెండింగ్ పెట్టారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకునే వారేరీ?..

మీటర్ రీడర్లకు స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్లు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదనే విషయాలు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మీటర్ రీడర్ల అధికారికంగా ఫిర్యాదు చేస్తే అప్పుడు చూద్దాములే అంటూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలున్నాయి. వేతనాలపై లిఖిత పూర్వకంగా కాంట్రాక్టర్లపై ఫిర్యాదు చేస్తే ఉన్న ఉద్యోగం పోతుందనే భయంతో మీటర్ రీడర్లు ఉన్నారు. దీన్ని అసరాగా చేసుకున్న స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి మీటర్ రీడర్ల వేతనాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రెండు రోజుల్లో వేతనాలు అందేలా చర్యలు



మీటర్ రీడర్లకు మూడు నెలలుగా వేతనాలు అందలేదన్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై కాంట్రాక్టర్లతో మాట్లాడి రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మీటర్ రీడర్లకు వేతనాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ప్రతి నెలా వారి ఖాతాల్లో 5వ తేదీ లోగా వేతనాలు జమ చేసేలా చూస్తాం

– శేషాద్రి శేఖర్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ, అనంతపురం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్ర నేరం

- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసు నమోదు చేయండి
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ''గర్భస్థ పిండ లింగ నిర్ధారణ తీవ్ర నేరం. నిబంధనలను ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు వాటి యాజమాన్యంపై కేసులు నమోదు చేయండి.'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అధికారులు బృందాలుగా ఏర్పడి జిల్లావ్యాప్తంగా స్కానింగ్ సెంటర్లు, డయాగ్నస్టిక్ సెంటర్లను ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ చర్యలు పాల్పడుతున్నట్లు సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం గురించి వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. లింగ నిర్ధారణకు ప్రయత్నించే, ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఆర్డీటీ ప్రతినిధి దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలి

అనంతపురం అగ్రికల్చర్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. రాయలసీమ అభివృద్ధి వేదిక, సీఐటీయూ, ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తర్వాత బ్యాంకు సీనియర్ మేనేజర్ చైతన్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటుకు చేస్తున్న చర్యలను తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్ కడపలో ప్రధాన కార్యాలయం కింద రాయలసీమ జిల్లాల పరిధిలో వందలాది బ్రాంచిలతో మారుమూల ప్రాంతాలకు సైతం బ్యాంకింగ్ సేవలు అందిస్తోందన్నారు. బ్యాంకును విలీనం చేసినా కడపలోనే ప్రధాన కార్యాలయం ఉండాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్న రాయలసీమ కూటమి పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని కోరారు. రాయలసీమ ప్రజల ఆకాంక్షలకు కోసం కృషి చేయాలని హితవు పలికారు. విభజన హామీలు అమలు చేయకుండా, అభివృద్ధి వికేంద్రీకరణకు పాతరేస్తూ... అన్నీ అమరావతికి తరలించడం అన్యాయమని విమర్శించారు. ఆయా సంఘాలు, రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు నాగేంద్ర, వెంకటనారాయణ, ముత్తుజ, మన్నీల రామాంజినేయులు, తిరుమలేష్, జిలాన్ బాషా, క్రిష్ణమూర్తి, శివారెడ్డి, బీహెచ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న సీఐటీయూ, రైతు సంఘం, కార్మిక సంఘం, రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు, కార్యకర్తలు

అరటి ఎగుమతి అవకాశాల పరిశీలనకు...

- నేడు జిల్లాకు ఇంగ్లండ్ ప్రతినిధి పత్రిక్ స్ట్రోబీ

అనంతపురం అగ్రికల్చర్: ఇంగ్లాడ్‌తోపాటు ఇతర యూరప్ దేశాలకు అరటి ఎగుమతుల అవకాశాల పరిశీలనకు ఇంగ్లండ్ దేశానికి చెందిన ఫెయిర్‌ట్రాసా ఆర్గనైజేషన్ కంపెనీ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పత్రిక్ స్ట్రోబీ ఆదివారం జిల్లాకు రానున్నారు. ఈమేరకు ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యానశాఖ కమిషనరేట్‌కు చెందిన జేడీ డాక్టర్ ఎంజీ దేవముని రెడ్డితో కలిసి ఇంగ్లండ్ ప్రతినిధి రాప్తాడు మండలం రామినేపల్లి వద్ద ఉన్న టిష్యూకల్చర్ అరటి ల్యాబ్, పుట్లూరు మండలం కడవకల్లు, పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట, తాడిపత్రి మండలం చుక్కలూరు, సంజీవపురం ప్రాంతాల్లో ఉన్న కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ ప్లాంట్లు సందర్శిస్తారని తెలిపారు. అరటి సాగు పద్ధతులు, రైతుల అనుభవాలు, నాణ్యత పరిశీలన, హార్వెస్టింగ్ పద్ధతులు, రోడ్డు, రైల్వే సదుపాయాల గురించి తెలుసుకుంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతులు అవుతుండగా భవిష్యత్తులో ఇంగ్లాండ్ ఇతర ఐరోపా దేశాలకు అరటి ఎగుమతులకు అవకాశం ఉంటుందని తెలిపారు. దీని వల్ల జిల్లాలో అరటి రైతులకు ఏడాది పొడవునా మంచి గిట్టుబాటు ధరలు లభించే పరిస్థితి ఉంటుందని వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు శివప్ప

గోరంట్ల: బూచేపల్లిలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సీఐ బోయ శేఖర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు శివప్ప (33) ఇటీవల తన పొలంలో బోరు వేశాడు. దీంతో కట్టెలపై తాత్కాలికంగా విద్యుత్ కేబుల్‌ను లాగాడు. శనివారం విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో కట్టెపై ఉన్న కేబుల్‌ను పరిశీలించేందుకు యత్నించాడు. కేబుల్ దెబ్బతిన్న చోట తాకడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రంజాన్‌కు వేళాయె!

- కనిపించిన నెలవంక
- నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు
- తరావీహ్ నమాజులకు సిద్ధమవుతున్న మసీదులు



అనంతపురంలోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్/ ఉరవకొండ/ రాయదుర్గం టౌన్: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ ఉపవాసాలు ఆదివారం నుంచి ఆరంభం కానున్నాయి. నెలవంక కనిపించడంతో శనివారం రాత్రి ఇషా నమాజ్ తర్వాత ఖురాన్ పఠనం(ప్రత్యేక తరావీహ్ నమాజ్) ప్రారంభమైంది. నెలరోజుల పాటు ప్రత్యేక తరావీహ్ నమాజ్ పఠిస్తారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే మసీదులు, దర్గాలు, మదర్సాలు సుందరంగా ముస్తాబయ్యాయి. సామూహిక ప్రార్థనలకు ముస్లింలందరూ సిద్ధమవుతున్నారు.

రోజా(ఉపవాస దీక్షలు): రోజూ ఉషోదయానికి ముందు నుంచి ఉపవాసాలు ప్రారంభిస్తారు. దీన్ని సెహరీ అంటారు. అలాగే సూర్యాస్తమయం కాగానే అల్పాహారంతో ఉపవాస దీక్షను విరమిస్తారు. దీన్ని ఇఫ్తార్ అంటారు. రోజా పాటించే వారు మనసును భగవంతునిపై లగ్నం చేసి చెడు ఆలోచనలకు దూరంగా ఉంటారు. సాధ్యమైనంత ఎక్కువ సమయం మసీదులు, దైవ ధ్యానంలో గడుపుతారు. రోజుకు కనీసం 14 గంటల పాటు ఉపవాస దీక్ష ఉంటుంది. రంజాన్ మాసంలో ఏహ్‌తేకాఫ్, జకాత్, ఫిత్రా, ఇఫ్తార్, తరావీహ్ నమాజ్‌కు ప్రత్యేకతలు ఉంటాయి.

ఇఫ్తార్ ప్రత్యేకత : రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాదీక్షను విరమింపచేసే కార్యక్రమాన్ని ఇఫ్తార్ అంటారు. ఈ ఇఫ్తార్ సమయంలో తీసుకునే ఆహారాన్ని దీక్ష వాసులకు అందించడం కూడా పుణ్యకార్యంగా భావిస్తారు. రంజాన్ మాసమంతా ఉపవాస దీక్షపరులకు విరివిగా ఇఫ్తార్ విందు ఇస్తారు.

తరావీహ్ నమాజ్: ముస్లింలు రోజూ 5 సార్లు నమాజును (ఉదయం ఫజర్, మధ్యాహ్నం జోహర్, సాయంత్రం 5 గంటలకు అసర్, 6.30 గంటలకు మగ్‌రిబ్, రాత్రి 8.30 గంటలకు ఇషా నమాజ్) చేస్తారు. అయితే రంజాన్ నెలలో ఇషా నమాజ్ తర్వాత ప్రత్యేకంగా ఎంతో నిష్ఠతో మరో 20 రకాత్‌లు తరావీహ్ నమాజ్ చేస్తారు. రంజాన్ మాసంలో తరావీహ్ నమాజ్‌కు అత్యంత ప్రాముఖ్యం ఉంటుంది.

అన్ని వసతులు కల్పిస్తున్నాం



పవిత్ర రంజాన్ మాసం కోసం ముస్లింలందరూ ఎదురు చూస్తుంటారు. ఉపవాసాలకు , ఇఫ్తార్ విందుల కోసం మసీదులకొచ్చే ఎంతో మందికి వసతులు చాలా ముఖ్యం. ఆ దిశగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడానికి అధికారులతో మాట్లాడుతున్నాం. మసీదులు, దర్గాలు, ఈద్గా మైదానం వద్ద లైటింగ్, శానిటేషన్, నీరు అన్ని సక్రమంగా ఉండేలా చూస్తాం. ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు. – మహ్మద్ వసీం, నగర మేయర్

కఠోర నియమాలు పాటించాలి



మనిషి అభివృద్ధి కావడానికి, ఆరోగ్యవంతుడు కావడానికి రంజాన్‌లో కఠోర నియమాలను పెట్టారు. రోజూ ఐదుసార్లు నమాజు, రాత్రి తరావీ నమాజు ఆచరించడం, జకాత్ పాటించడంతో చెడు వ్యసనాలకు దూరమవుతారు. నియమబద్ధమైన ఉపవాసంతోనే సర్వశ్రేష్ఠుడైన అల్లాహ్‌ను మెప్పించగలం.

– హాజీ మహ్మద్ రఫీ, చాందినీ మసీదు

వెయ్యి జన్మల పుణ్యఫలం



రంజాన్ మాసంలో ఖురాన్ ఆవిర్భవించింది కాబట్టే ఈ మాసానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఈ రోజుల్లో చేసే ఉపవాసాల వల్ల వెయ్యి జన్మల పుణ్యఫలం వస్తుందని ఖురాన్ చెబుతోంది. దానధర్మాలతో, భక్తిభావంతో రంజాన్ నెలను గడుపుదాం.

– కాగజ్‌ఘర్ రిజ్వాన్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య



మృతుడు రామ్మోహన్(ఫైల్)

పెద్దవడుగూరు : చిత్రచేడు గ్రామంలో అప్పులబాధ తాళలేక ఓ యువరైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన రంగయ్యకు కుమారుడు రామ్మోహన్(29), ఇద్దరు కుమార్తెలున్నారు. రామ్మోహన్ తమకున్న ఐదెకరాల పొలంలో వర్షాధారంగా పత్తి పంట సాగు చేసేవాడు. ఈక్రమంలో పంట పెట్టుబడి కోసం తెలిసిన వారి దగ్గర, తండ్రి పేరు మీదుగా బ్యాంకులో దాదాపు రూ.6 లక్షల దాకా అప్పు చేశాడు. రెండేళ్లుగా పంట సరిగా చేతికిరాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈక్రమంలో అప్పులను ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై శనివారం గ్రామ సమీపంలోని పెన్నానదిలో ఉన్న మామిడితోటలో చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. మృతుడి భార్య నవ్య, ఇద్దరు పిల్లలున్నారు.

మానసిక ఒత్తిళ్లతోనే ఆత్మహత్యలు

- మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ సవిత మల్హోత్ర
- డాక్టర్ ఎండ్లూరి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సవిత మల్హోత్ర. చిత్రంలో డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్

అనంతపురం మెడికల్: ప్రస్తుతం కుటుంబ, సామాజిక బాంధవ్యాలు కనుమరుగై మానసిక ఒత్తిళ్లతోనే చాలా మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారని మానసిక వైద్యుల సంఘం జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ సవిత మల్హోత్ర అభిప్రాయపడ్డారు. అనంతపురం సైకియాట్రిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం నగర శివారులోని ఓ కన్వెన్షన్ హాల్లో జాతీయ స్థాయి మానసిక వైద్యుల నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో వంద మందిలో 35 నుంచి 40 మంది తీవ్ర ఒత్తిళ్లకు లోనై మానసిక సమస్యలతో ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలతో సగం సమయాన్ని వృథా అవుతోందని, తద్వారా బంధువులు, స్నేహితులు, తదితరులతో స్నేహపూర్వక వాతావరణం లేకుండా పోతోందన్నారు. దీనికితోడు ఉన్నత విద్యనభ్యసించాలని, నిర్బంధ విద్యతో విద్యార్థులు మానసికంగా కుంగిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు, యువతపై వ్యసనాలు తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ఎటువంటి ఒత్తిళ్లు చేయకుండా వారి భవిష్యత్తు బాగా ఉండేలా క్రమశిక్షణతో పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ స్థాయి సదస్సు ఏర్పాటు చేసిన డాక్టర్ ఎండ్లూరిని ఆమె అభినందించారు. డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ ఈ సదస్సుకు డాక్టర్ సవిత మల్హోత్ర హాజరుకావడం ఆంధ్రప్రదేశ్ మానసిక వైద్యుల సంఘానికి దక్కిన గౌరవమని కొనియాడారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు ప్రసంగించారు. నంతరం మానసిక వైద్యంలో వచ్చిన అత్యాధునిక వైద్యం, ఆధునిక వైద్య విద్యలు, పరిశోధనలపై ప్రముఖ సైకియాట్రిస్టులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సీనియర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ టీపీ సుధాకర్, డాక్టర్ రమణ రావు, డాక్టర్ జగదీష్, డాక్టర్ రఘురాం, డాక్టర్ వికాస్ మీనన్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి, డాక్టర్ శరశ్చంద్ర, డాక్టర్ రాధికారెడ్డితోపాటు వివిధరాష్ట్రాలకు చెందిన 300 మంది మానసిక వైద్యులు పాల్గొన్నారు.

స్టేడియంలోకి అనుమతించకపోవడంపై నిరసన



హోం మంత్రికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

అనంతపురం: నీలం సంజీవరెడ్డి స్టేడియంలోకి తమను అనుమతించకపోవడంపై పెద్ద ఎత్తున క్రీడాకారులు, క్రీడా ప్రతినిధులు నిరసన తెలిపారు. వందలాది మంది క్రీడాకారులు సప్తగిరి సర్కిల్ నుంచి ర్యాలీగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బస చేస్తున్న అలెగ్జాండర్ హోటల్ వద్దకు చేరుకున్నారు. అయితే వారిని పోలీసులు రోప్ పార్టీతో నిలువరించారు. అనంతరం రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, క్రీడా సంఘాల నాయకులు చంద్రమోహన్ రెడ్డి, వాలీబాల్ చిన్నా తదితరులు హోం మంత్రికి వినతిపత్రం అందజేశారు. శాప్ ద్వారా క్రికెట్ కోచింగ్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్‌కు ప్రభుత్వం కోచ్‌లను నియమించిందని, వారి సాధనకు గ్రౌండ్ లేకుండా, పీటీసీ డీఎస్పీ స్థాయి అధికారి తమను వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. 300 మంది ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారన్నారు. దాదాపు 40 ఏళ్లుగా ఎప్పుడు ఏ విధమైన అడ్డంకులు సృష్టించలేదన్నారు. పీటీసీ డీఎస్పీ కోటిరెడ్డి నిరంకుశంగా, ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారన్నారు. క్రీడాకారుల సమస్యలపై హోం మంత్రి సానుకూలంగా స్పందించినట్లు క్రీడా ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు కమలాకర్‌నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ విజయరాజు, క్రికెట్ కోచ్ శర్మాస్ వలి, దాదాపీర్, రఘు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపిన మేయర్



అనంతపురం ఎడ్యుకేషన్: ముస్లిం సోదరులకు అనంతపురం నగరపాలక సంస్థ మేయర్ వసీం సలీం రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రంజాన్ మాస ఉపవాసాలు ప్రేమ, దయ, కరుణ వంటి వాటికి శుభ సూచికమని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గాలతో ముస్లింలు ఈ నెల మొత్తం కఠోరమైన దీక్షతో ఉపవాసాలు ఉంటారని తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అశోక్‌కుమార్ నాయక్



చెన్నేకొత్తపల్లి: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అశోక్‌కుమార్ నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీఓగా ఉన్న శివశంకరప్ప పదవీ విరమణ చేయడంతో ఉన్నతాధికారులు ఈఓఆర్డీగా పని చేస్తున్న అశోక్‌కుమార్ నాయక్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా వేసవిలో మండలంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు చేస్తామన్నారు.

ఘనంగా 'అనంతలక్ష్మీ' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: నగర శివారులోని అనంతలక్ష్మీ ఇంజినీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఫౌండర్ డైరెక్టర్ కె.లక్ష్మీనారాయణ, జలవనరుల శాఖ సలహాదారు ఎన్.కన్నయ్య నాయుడు ముఖ్య అతిథులుగా, జేఎన్‌టీయూ (అనంతపురం) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు, ప్రిన్సిపాల్ ఎస్.రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో 'మాంటిస్సోరి'కి పతకాల పంట



ప్రశంసాపత్రాలు, మెడల్స్‌తో విద్యార్థులు, మాంటిస్సోరి అధినేత సూర్యనారాయణరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంగ్లిష్ ఒలింపియాడ్‌లో సంగమేష్‌నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. యూనిఫైడ్ కౌన్సిల్ వారు ఇటీవల జాతీయస్థాయిలో దాదాపు 80 వేలమంది విద్యార్థులకు నిర్వహించిన 'యూనిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్' (యూఐఈఓ) పరీక్షలో మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు 6, 11, 16, 20, 2, 26, 27, 31, 33, 35 ర్యాంకులు సాధించారు. స్వర్ణ పతకాలు, నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు అందుకున్నారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత సి.సూర్యనారాయణరెడ్డి ఈ విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులు 'నేషనల్ అచీవర్స్'గా గుర్తింపు పొందడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే ఆంగ్లభాష నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హంస వాహనంపై మహాదేవుడు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీదేవి సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10వ రోజైన శనివారం రాత్రి స్వామి వారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి ని వివిధ రకాల పూలతో అలంకరించిన అర్చకులు పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం పార్వతీదేవీ సమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల మూల మూర్తులకు అర్చకులు వేదమంత్రాల నడుమ వసంతోత్సవం చేశారు. భక్తులు భక్తి పారవశ్యంతో రంగునీళ్లు చల్లుకున్నారు.

దాదులూరు జాతరకు వేళాయె!

- నేటి నుంచి దాదులూరు పోతలయ్య స్వామి జాతర
- ఎలువగంప ఊరేగింపుతో జాతరకు అంకురార్పణ
- శివ, కేశవులు ఒకేచోట కొలువుదీరిన ఆలయం
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- సుదూర ప్రాంతాల నుంచి తరలిరానున్న లక్షలాది మంది భక్తులు





దాదులూరులో జాతీయ రహదారి పక్కన ఉన్న పోతలయ్యస్వామి ఆలయం, కొలువుదీరిన పోతలయ్య, చెన్నకేశవస్వాములు

కనగానపల్లి: మహా శివరాత్రి తర్వాత ఏటా జరిగే దాదులూరు పోతలయ్య స్వామి జాతర వచ్చేసింది. సుమారు 5 శతాబ్దాల క్రితం నుంచి ఈ జాతర జరుగుతోందని స్థానికులు చెపుతున్నారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు సుదూర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. ఈ జాతరలో పాల్గుణ శుద్ధ పంచమి రోజున పోతలయ్య స్వామికి నిర్వహించే గావుల మహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది. 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలసిన ఈ దేవాలయం రెండు ఆలయ గోపురాలతో నిర్మించారు. ఇందులో పోతలయ్య, చెన్నేకేశవ స్వామి రూపాల్లో శివ, కేశవులు పక్క పక్కనే కొలువు దీరి ఉండటం విశేషం. వీరితో పాటు బంగారు లింగయ్య స్వామి కూడా ఇక్కడే కొలువుదీరాడు. దీంతో ఏటా పోతలయ్య, చెన్నేకేశవ స్వామి కాపులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చి పూజలు నిర్వహిస్తారు. ఇక పోతలయ్య స్వామికి ప్రత్యేకంగా నిర్వహించే గావుల మహోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. దీంతో ఇక్కడ జరిగే జాతరలో వందల సంఖ్యలో మిఠాయి, గాజులు, బొమ్మల దుకాణాలు వెలుస్తాయి.

మూడు రోజుల పాటు జాతర..

పోతలయ్య స్వామి జాతర ఆదివారం నుంచి మూడు రోజులు పాటు జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. ఇందులో తొలిరోజు యలవగంప ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుంది. రామగిరి మండలం గంతిమర్రి, కలికివాండ్లపల్లి గ్రామాల నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపులో పోతలయ్య స్వామి కాపులు స్వామి వారి ఆభరణాలు, పూలను బుట్టల్లో తీసుకొని వచ్చి అలంకరణ చేస్తారు. రెండవ రోజు సోమవారం పోతలయ్య, చెన్నేకేశవ స్వాములకు జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తారు. చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు, భక్తులు పన్నేరు బండ్లతో ఆలయ చుట్టూ ప్రదక్షణలు చేసి బోనాలు సమర్పిస్తారు. ఇక మూడవ రోజు మంగళవారం వేకువజామున నిర్వహించే గావుల మహోత్సవంలో 11 మంది పోతురాజుల చేత స్వామి వారికి మేక పిల్లలను బలి ఇచ్చి పోతలయ్య స్వామికి రక్తతర్పణం చేస్తారు. ఈ జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్, రెవెన్యూ అధికారులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

గావుల మహోత్సవానికి ప్రత్యేకత



పోతలయ్య స్వామి జాతరలో జరిగే గావుల మహోత్సవానికి ఎంతో ప్రత్యేక ఉంది. పాల్గుణ పంచమి గడియల్లో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా పలు ప్రాంతాల నుంచి పోతురాజులు వస్తారు. ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం మధ్య ఉరుముల శబ్దాలతో వీరు నృత్యాలు చేస్తూ.. మేకపోతు పిల్లలను నోటితో కొరికి స్వామికి బలి ఇస్తారు. తర్వాతా వందలాది మూగ జీవాలను భక్తులు స్వామికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

– శివయ్య, ఆలయ పూజారి, దాదులూరు

జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు



మూడు రోజుల పాటు జరిగే దాదులూరు జాతరకు గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేశాం. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం, భోజన వసతి కల్పిస్తాం. భక్తుల దర్శనానికి పోతలయ్యస్వామి ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు భక్తులంతా సహకరిస్తే జాతరను వైభవంగా నిర్వహిస్తాం.

– రామలింగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్, దాదులూరు

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



మొదటిరోడ్డు శివాలయంలో శివరాత్రి ముగింపు వేడుకలు

అనంతపురం కల్చరల్: మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలోని శారదా మఠంలో ఈఓ రమేష్‌బాబు నేతృత్వంలో ముగింపు వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలతో స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు పవిత్ర జలాలతో త్రిశూల స్నానం చేయించారు. ఆ జలాలతో సాగిన వసంతోత్సవం సందడి నింపింది. భక్తులు ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ ఓం నమఃశివాయ అంటూ నామస్మరణ చేశారు. అనంతరం ధ్వజ అవరోహణంతో వేడుకలు ముగిసినట్లు ఆలయ ప్రతినిధులు, అర్చకులు తెలిపారు. రాత్రి పార్వతీ పరమేశ్వరుల శయనోత్సవం నేత్రపర్వంగా సాగింది. కార్యక్రమంలో నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి రూ.41 వేల జరిమానా



సామాజిక తనిఖీలో భాగంగా నివేదికలు పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందికి రూ.41 వేల జరిమానా విధించారు. అలాగే రూ.32 వేలు రికవరీకి ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల (2023–24 సంవత్సరం)కు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. సీఆర్పీలు నివేదికలను చదివి వినిపించారు. ఈ క్రమంలోనే రికవరీతో పాటు ఉపాధి హామీ సిబ్బందికి జరిమానా విధించారు. అంతేకాకుండా రూ.7.70 లక్షలకు సంబంధించిన వివిధ పనులు పెండింగ్‌లో ఉండగా... వాటిని పది రోజుల్లో పూర్తి చేయించి ఫొటోలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి శశికళ, జిల్లా విజిలెన్స్ అదనపు అధికారి పర్వేజ్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ చెన్నకేశవులు, ఎంపీపీ హేమలత, ఎంపీడీఓ లక్ష్మీ నరసింహ, ఏపీఓ సుజాత, ఈసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సనప మాధవరాజుల ఉత్సవాలు ప్రారంభం



సనప మాధవరాజుల స్వామి



సనప మాధవరాజుల స్వామి ఆలయం

ఆత్మకూరు: జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన సనప మాధవరాజుల స్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలితొలిరోజు చెరుకును కొలనుకు తీసుకువచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 2వ తేదీ స్వామి వారిని సనప గ్రామం నుంచి ఊరు బయట ఉన్న దేవాలయానికి ఉరుములతో, మేళతాళాలతో తీసుకువెళ్తారు. 3వ తేదీన గ్రామంలోని పన్నేరపు బండ్లను ఆలయం చుట్టూ తిప్పుతారు. 4వ తేదీ సాయంత్రం రథోత్సవం ఉంటుంది. అనంతరం కొలను పూజ నిర్వహిస్తారు. 5వ తేదీన స్వామి వారి అలంకరణ, పరుష ఉంటుంది. 6వ తేదీన ఊరు బయట ఆలయంలో ఉన్న స్వామివారిని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా సనప గ్రామానికి చేరుస్తారు. 7వ తేదీన బారు పూజతో ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



విత్తనశుద్ధి చేస్తున్న ప్రకృతి వ్యవసాయ గాండ్లపర్తి యూనిట్ ఇన్‌చార్జి వై.దేవి

రాప్తాడు: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ గాండ్లపర్తి యూనిట్ ఇన్‌చార్జి యంగిరెడ్డి దేవి తెలిపారు. శనివారం ఆమె మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. రైతులు ఉల్లికంటి భాస్కర్ రెడ్డి, లలిత పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రిమాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానాన్ని రైతులకు వివరించారు. పీడీఎస్ విధానంలో సద్ద, కంది, ఆముదం , అనుములు, గోరు చిక్కుడు తదితర వాటితో పాటు 20 రకాల విత్తనాలను శుద్ధి చేసి ఘన జీవామృతంతో విత్తారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ వై.దేవి మాట్లాడుతూ, పీఎండీఎస్ విధానం ఆచరించడం వల్ల పంటకు అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. జీవ వైవిధ్య పంటల ద్వారా నేలలో నైట్రోజన్ పెరిగి, మట్టిలో పోషక లభ్యత మెరుగుపడుతుందన్నారు. ఈ విధానం ద్వారా రైతులకు అదనపు ఎరువులు, పురుగుల మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. పీఎండీఎస్ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధ్యమవుతాయన్నారు. భూమి కూడా సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సాధికార బృందం సభ్యులు కుళ్లాయమ్మ, పోతులయ్య, సల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

అనంతపురం క్రైం: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ మొదటి రోజు శనివారం సజావుగా చేపట్టినట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. జిల్లాలో 2,79,695 మంది పింఛన్‌దారులకు గాను మొదటి రోజు 2,64,422 మందికి నగదు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

అమరుల త్యాగాల వల్లే వర్గీకరణ



రాప్తాడులో మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాప్తాడు: మాదిగ అమరవీరుల త్యాగాల వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వతంత్ర కుమారి అన్నారు. శనివారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం ముందు మాదిగ అమర వీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ మూడు దశాబ్దాల పోరాటమన్నారు. ఈ పోరాటంలో మందకృష్ణ మాదిగ పాత్ర మరవలేనిదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నరసింహ, నాయకులు పోతులయ్య, శేఖర్, ఓబుళపతి, రామాంజి, లక్ష్మీనరసమ్మ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి



విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి తగ్గదలను అరికట్టవచ్చని నగరంలోని ఎస్సీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధరరెడ్డి మాట్లాడుతూ హిమోగ్లోబిన్ తగ్గితే పలు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ గుడ్డు, నారింజ, నిమ్మ, పాలకూర, దానిమ్మ వంటివి తీసుకుంటే హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుకోవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాసులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, జీవసాంకేతిక శాస్త్రం అధ్యాపకులు ఎస్.రిజ్వానా బేగం, టి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

పామిడి: మామిడిలో యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని పుట్టపర్తి ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సైంటిస్టు డాక్టర్ రామసుబ్బయ్య సూచించారు. శనివారం మండలంలోని ఎద్దులపల్లిలో దళిత రైతులు సాగుచేస్తున్న మామిడితోటలను ఆయనతో పాటు హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవిందా మాధవి పరిశీలించారు. పూతదశలోని మామిడికాయపై రసం పీల్చే పురుగు ఆశించి ఉండడాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఆయన మామిడి రైతుల శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లీటర్ నీటికి 1.5 గ్రాముల హస్పెట్ (లేదా) 0.4 మిల్లీలీటర్ల కాన్ఫిడార్ కలిపి పైరుపై పిచికారీ చేయడం వల్ల రసంపీల్చే పురుగులను నివారించవచ్చన్నారు. అలాగే కాయదశలో ఫ్రూట్ బ్యాగ్స్ తొడగడం వల్ల రసంపీల్చే పరుగులు, ఈగలు ఆశించకుండా నివారించవచ్చన్నారు. పూతదశలో సక్రమంగా మొక్కకు నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవిందా మాధవి, దళిత రైతులు, ఉద్యానవన, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందమానందమాయె..



శిక్షణ ముగించుకున్న తర్వాత కూతురిని ముద్దాడుతున్న తల్లి



ఎస్‌ఐ తండ్రితో తోటి ఎస్‌ఐల గ్రూప్ ఫొటో




తండ్రికి టోపీ పెట్టి ఆనంద వ్యక్తం చేస్తున్న ఎస్‌ఐ



ఎస్‌ఐల పాసింగ్ అవుట్‌పరేడ్‌కు హాజరైన ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్, ఎంఎస్ రాజు, పల్లె సింధూర



శిక్షణ పూర్తయిన సందర్భంగా కుటుంబ సభ్యులతో సెల్ఫీ



తల్లి షర్టుపై స్టార్స్ సరిచేస్తున్న పిల్లలు

అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో స్టైఫండరీ కేడెట్ ట్రైనీ –2024 ఎస్‌ఐల పాసింగ్ అవుట్‌పరేడ్ శనివారం సందడిగా సాగింది. ముఖ్య అతిథులుగా హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా హాజరయ్యారు. శిక్షణలో ప్రతిభ కనబరచిన వారు పతకాలు, ట్రోఫీలు అందుకున్నారు. అనంతరం ఎస్‌ఐలు తమ కుటుంబ సభ్యులతో ఫొటోలు దిగి ఆనందాన్ని పంచుకున్నారు. ఉన్నత స్థాయికి ఎదిగిన బిడ్డలను చూసి తల్లిదండ్రులు తన్మయత్వం చెందారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



పాసింగ్ అవుట్‌పరేడ్‌కు వచ్చిన ఎస్‌ఐల కుటుంబ సభ్యులు

'సమస్యలు తెలిపే స్వేచ్ఛ కూడా లేదా?'

అనంతపురం టవర్‌క్లాక్: దళితుల సమస్యలపై హోం మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి వెళితే పోలీసులు అడ్డుకోవడం శోచనీయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ నాయకులను పోలీసులు అడ్డగించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. వీటిని హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లనివ్వకుండా పోలీసులు ఆపారని, మా సమస్యలు మీకు పట్టవా అని నిలదీశారు. కార్యక్రమంలో నాయకులు గంగులయ్య, కాటమయ్య, రామకృష్ణ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని రజక సంఘాల పోరాట సమితి కో–కన్వీనర్ హనుమన్న కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రజక కార్పొరేషన్‌కు నిధుల ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడం శోచనీయమన్నారు. రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చాలని, దేవదాయ కమిటీల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శివానంద, రామాంజినేయులు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.